# స్వామీజీ!

రచన :
శ్రీ ఆర్. కిషన్ రావు

"ఒసే శకుంతలా! నేనూ వస్తున్నాను. ఆగవే!"

అన్న పిలుపు విని గబగబా నడుస్తున్న శకుంతల తక్కువ ఆగి వెనుదిరిగి చూచింది. ఖాళీ బిందుపట్టుకొని నడచివస్తున్న అనసూయత్త కనబడింది.

అనసూయ శకుంతల దగ్గరకు వచ్చింది. ఇద్దరూ మాట్లాడుకుంటూ వాగువైపు నడవసాగారు.

ఆగ్రామములో బావులు చాలా తక్కువ. ఉన్ననాల్గు బావుల్లోని నీరు ఉప్పన. ఆ బావుల నీటితో ఉపయోగం తక్కువ. ఊరి మధ్య రావిచెట్టు దగ్గర ఓ బావి వుంది. ఆ బావి ఎన్నాళ్ళ క్రితం త్రవ్వించారో, ఎవరు త్రవ్వించారో ఎవరికీ తెలియదు. ఆ బావిలోని నీరు ఉప్పునీరు కాకపోయినా, చెట్టుపై నివసించే పక్షులు రెట్టవేయుట వలన, రావి ఆకులు రాలి నీరు చెడిపోవుట వల్ల అందులోని నీరు ఎవ్వరూ వాడుకోరు. ఊళ్ళోని వాళ్ళందరూ త్రాగుటకు, వంటచేసుకొనుటకు వాగునీళ్ళే తెచ్చుకుంటారు. చాలామంది ఆడవాళ్ళు సూర్యోదయానికి పూర్వమే లేచి వాగుకు వెళ్తారు.

ఊరుకు ఉత్తర దిశలో వాగువుంది. దక్షిణభాగాన కాస్త వలయాకారంలో కొండవుంది. ఆ కొండ దక్షిణ దిశ నుండి నాలుగేళ్ళ నుండి ఆర్. టి. సి. బస్సు నడుస్తూ వుంది. ఆ బస్సు నడవడానికి రంగనాథమే కారణమని ఊళ్ళో చాలామంది అనుకొంటుంటారు.

అనసూయ భర్త రంగనాథం. వారికి ఒక్కతే కూతురు పెళ్ళయి ఆరునెలలయింది. అల్లుడు హైద్రాబాదులో ఏదో కంపెనీలో పనిచేస్తున్నాడు. అనసూయకు ఆర్థిక ఇబ్బందులు లేక పోయినా, రోగపీడితురాలైన అత్తకు సేవలు చేయడంలో కాస్త ఇబ్బందిగానే వుంది. అయినా అత్తగారికి విసుగులేకుండా సేవలుచేస్తుంది. అందుకే ఆమె అత్తగారు లేవక పూర్వమే వాగునీళ్ళు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తుంది.

శకుంతలా రామనాథంలు ఆదర్శ దంపతులని ఊళ్ళో పేరు పొందారు. వారికి పాడిపంటలకు కొరవ లేదు. కాని పెళ్ళయి పది సంవత్సరాలు గడచినా పిల్లలు కలుగక పోవడం వలన శకుంతలకు బెంగ ప్రారంభమయింది. రామనాధంకు బెంగవుందో లేదో తెలియదు. కాని క్రమ పద్ధతిలో వ్యవసాయం చేస్తుంటాడు.

రామనాధం పొగాకు, రంగనాథం మిరపకాయలు పండిస్తుంటారు. వాళ్ళిద్దరికీ ఇరవైయేళ్ళ భేదం వున్నా, ఆయేళ్ళ భేదం శరీరాలకే పరిమితం. వాళ్ళమధ్య బంధుత్వమే కాకుండా స్నేహం కూడా వుంది. వీళ్ళిద్దరికీ సరితూగే వ్యక్తి చలపతి. అతడు ఎక్కువగా పసుపు పండిస్తాడు. ఆతనికి చెవులు వినబడవు. అతడు ధనవంతుడే అయినా ఊళ్ళో ఎక్కువ పలుకుబడిలేదు. మిగతా రైతులు బీదవాళ్ళు కాకపోయినా, ఈ ముగ్గురితో సరితూగరు. రంగనాథం, రామనాథం పెద్దగా చదువుకున్న వాళ్ళు కాకపోయినా వూళ్ళోని ప్రజలపై అధికారం చెలాయించే నేర్పు వుంది. ఆ వూళ్ళో చదువుకున్నవాళ్ళ సంఖ్య చాలా తక్కువ.

శకుంతలా అనసూయలు కుటుంబ విషయాలు మొదలుకొని బాబాల మహాత్మ్యాల వరకు ఎన్నో విషయాలు మాట్లాడుకుంటూ ఆంజనేయస్వామి గుడిముందుకు వచ్చారు.

"శకుంతలా! రావిచెట్టుకు, ఆంజనేయస్వామి గుడికి మధ్య నీకేమైనా కనిపిస్తుందా?" హఠాత్తుగా ఆగి అంది అనసూయ. దయ్యమేమోనని ఆమె అనుమానం.

వలయాకారపు కొండ దగ్గర పాతబడి కూలిపోతున్న పెద్ద బంగ్లా వుంది. ఆ బంగ్లాలో దయ్యాలున్నాయనీ,




ఎల్లప్పుడూ.....
టి. ఎన్. హెచ్. వారి
* సైనిక్స * ఆర్. ఓ.
కలర్ బనిన్లనే
ఉపయోగించండి.

ఆంధ్రా మరియు ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపటం-4.

వాటిని గనుక ఆ బంగ్లా నుండి కొండ అవతలకు వెళ్ళగొట్టకపోతే అవి ఏనాడో ఓనాడు ఊళ్ళోకి కూడా వస్తాయనీ ప్రజలు అనుకొంటుంటారు.

అనసూయ మొదట భయపడింది. కాని ఆంజనేయ స్వామి గుడి చెంతకు దయ్యాలురావని నిర్ధారణ చేసుకొని ధైర్యం తెచ్చుకొంది.

శకుంతల అటువైపు చూచి "ఎవరో స్వాములవారి లాగె వున్నా రత్తయ్యా! వెళ్ళి చూద్దామా!" అంది.

"స్వాముల వారేనా! అయితే పద" అంది అనసూయ భక్తితో, సంతోషంతో.

ఇద్దరూ ఆంజనేయస్వామి గుడి దగ్గరకు వచ్చారు.

స్వాములవారు కళ్ళు మూసుకొని మెల్లగా ఏవో మంత్రాలు చదువుతున్నాడు.

ఇంతలో నీళ్ళకోసం ఏటివైపు వెళ్తున్న అమ్మలక్కలు పది పన్నెండు మంది వరకు అక్కడికి వచ్చిచేరారు.

"ఎవరు స్వామీ మీరు?" అడిగింది శకుంతల. స్వామి మంత్రాలు చదువుతున్నాడు. సమాధానం రాలేదు.

"తపస్సులో వున్నప్పుడు మాట్లాడిస్తే కోపించి శపిస్తారేమో" అంది ఓ పెద్ద ముత్తైదువ.

పూర్తిగా తెల్లవారింది. అనసూయ, శకుంతల వాగు వైపు వెళ్ళిపోయారు.

సూర్యోదయమై గంటగడచినా స్వామీజీ కన్నులు తెరవలేదు. మంత్రాలు చదవడం మానలేదు.


స్వాములవారి వద్దకు ప్రజలు వస్తున్నారు, పోతున్నారు.

మధ్యాహ్నం పదకొండు గంటలు దాటింది.

స్వామీజీ కోసం కొందరు అరటిపండ్లు, కొందరు సేపులు కొందరు పాలగ్లాసులు తెచ్చి అతని ముందు పెట్టారు. సాయంకాలమైంది కళ్ళు తెరవలేదు మంత్రాలు చదవడం మానలేదు.

సూర్యుడు కనుమరుగయ్యాడు, ప్రజలు వెళ్ళిపోయారు.

మరునాడు పూర్తిగా తెల్లవారకముందే ప్రజలు గుంపులు గుంపులుగా స్వామి చెంతకు వచ్చారు. గత దినం వారి ముందు పెట్టిన పండ్లు, పాలగ్లాసులు పెట్టినవి పెట్టినట్లేవున్నాయి.



విఠల్ కంబైన్స్‌వారి 'గంధర్వకన్య' (కలర్) చిత్రంలో ఒక దృశ్యం.

రంగనాథం వచ్చి కళ్ళుమూసుకొని వున్న స్వామిజీకి వినయంగా నమస్కరించాడు.

రంగనాథం నమస్కరించడం వలన స్వామీజీ చాలా గొప్పవాడని ప్రజలు నిర్ధారణ చేసుకున్నారు.

స్వాములవారికి అతీత శక్తులుండవచ్చునని భావించిన రంగనాథంవారు ఎప్పుడు కళ్ళు తెరుస్తాడా అని ఎదురు చూడసాగాడు. అతని దయ సంపాదించి తన తల్లి రోగం నయం కావడానికి ఏదైనా మార్గం చూపెట్టుమని అడగాలని అనుకొంటున్నాడాయన.

స్వామి భక్తులు చాలామంది పండ్లు, పాల గ్లాసులు తెచ్చి ముందు పెడుతున్నారు. ఆనాడు కూడా కళ్ళు తెరవలేదు.

చీకటి కాగానే ప్రజలు వెళ్ళిపోయారు.

మరునాడు కూడా తెల్లవారక ముందే స్వామీజీని చూడాలని చాలామంది ప్రజలు గుంపులు గుంపులుగా వచ్చారు.

స్వామీజీ ముందు గత రెండు రోజులుగా పెట్టిన పండ్లు, పాలగ్లాసులు కనిపించలేదు. కదలక మెదలక కూర్చున్నారు. కళ్ళు మూసుకొని మెల్లగా మంత్రాలు చదువుతున్నాడు.

"స్వామీజీ కదిలినట్లు లేదు" అని కొందరు, ముందుంచిన పండ్లు, పాలగ్లాసులు ఏమైనట్లు అని కొందరు, రాత్రివేళ ఎవరోవచ్చి స్వామీజీ ముందుంచిన పండ్లు, పాలగ్లాసులు ఎత్తుకుపోయినట్లున్నారు అని కొందరు, ఇలా ఎవరికి తోచిన అభిప్రాయం వారు వెల్లడించారు.

స్వామీజీ గొప్పశక్తి కలవాడని కొందరు, ఆంజనేయస్వామి ప్రజలపై దయతలచి ఈ రూపంలో దర్శనమిస్తున్నాడని మరికొందరు అభిప్రాయపడ్డారు.

స్వామీజీతో మాట్లాడాలని కొందరు, ఏది కోరినా ఇచ్చి అతనిని సంతోషపెట్టాలని కొందరు అనుకోసాగారు.

అయిదు పగళ్ళు, అయిదు రాత్రులు గడచిపోయాయి. స్వామీజీ మాత్రం ఎక్కడ కూర్చున్నవాడు అక్కడే వున్నాడు.

ఆరవనాటి సాయంకాలం వేళ చాలామంది ప్రజలు స్వామీజీ చుట్టూకూర్చుండి రామ భజన చేయసాగారు. రామ భజన చేస్తే స్వామీజీకి దయ కలుగుతుందని, తమను చూస్తాడని తమతో మాట్లాడుతాడని ప్రజలు గాఢంగా విశ్వసించారు.

స్వామీజీ కళ్ళు తెరిచాడు. అకస్మాత్తుగా భజన ఆగిపోయింది. ప్రజలందరూ స్వామీజీనే చూస్తున్నారు.

స్వామీజీ ఒక్క చిరునవ్వు నవ్వాడు.

"స్వామీ! మీ రెవ్వరూ?" రామనాథం ప్రశ్నించాడు.

"స్వామీజీ ఒక్క క్షణం కళ్ళు మూసుకొని మళ్ళీ

ఎల్లప్పుడూ "జీబ్రా" బనియన్లనే ఉపయోగించండి!!

Always use Zeebra BANIANS

ఎందుకనగా...

అవి, కరెక్ట్‌సైజు, చక్కని అల్లిక, దీర్ఘకాలమన్నిక.

మా తయారింపులు :—

♦ ఫాంటా ♦ రాజు

♦ జీబ్రా ♦ జుల్లీట్

: తయారించువారు :

TEL : "ZEEBRA" PHONE : 21686

Zeebra Hosieries

LAKHSMINAGAR MAIN ROAD :: TIRUPUR-638 602

కె. పి. జి. వారి అపూర్వ కానుక!!

* రాజు ఇజిప్షిన్ * టిప్‌టాప్ ప్లైన్.
* గోరా ఇజిప్షిన్ * చిల్డ్రెన్
* గోల్డన్ డాలర్ * కె. పి. జి. ఇంటర్ లాక్

మరియు ఇతర రకాలకు ప్రసిద్ధి చెందిన పేరు

"కె. పి. జి."

తయారించువారు :

K. P. G. Knitting Co.

4/2, Harvey Road : : TIRUPUR-638602

తెరిచి ప్రజలందరినీ కలియజూచి ప్రసన్నవదనంతో "భక్తులారా! నన్ను పరమాత్ముడు పంపగా ఇక్కడకు వచ్చాను. మీలో ఎవరికి ఏమి కష్టం వున్నా నాతో చెప్పండి. నేను పరమాత్ముని ఆజ్ఞ తీసుకొని వారి వారి కష్టాలు తీర్చి పోతాను" అన్నాడు,

ప్రజల ముఖాలపై సంతోషం ఉప్పొంగడం గమనించి చాలా సంతోషపడ్డాడు.

స్వామీజీ రామనాథం ప్రక్కన నిలబడివున్న శకుంతలవైపు చూచి "అమ్మా! నీవు సంతానం కాలేదని బాధపడుతున్నావు కదూ!" అన్నాడు.

శకుంతల ఆశ్చర్యపోయి "నిజమే నా మనసులోని బాధ మీకెలా తెలిసింది స్వామీ" అంది.

చిరునవ్వు నవ్వి గడ్డం దువ్వుకుంటూ అన్నాడు. "మేము సర్వమూ గ్రహించగలం. లోకంలో జరిగే ప్రతి సంఘటన మాకు తెలుస్తుంది. అలాగని మీరడిగే ప్రశ్నలన్నింటికీ సమాధానాలు చెప్పం. పరమాత్ముడు ఆదేశించినట్లు నడుస్తాం."

"ఈ అమ్మాయికి సంతానం కావలెనన్న ఏం చేయాలి స్వామీజీ!" అంది అనసూయ ఆవేశంలో.

స్వామీజీ ప్రక్కనే వున్న జోలెనుండి దోసెడు బూడిదలాంటి పదార్థంతీసి పైకి వెదచల్లాడు. అది చుట్టూ వ్యాపించింది. కొన్ని క్షణాలపాటు స్వామీజీ ప్రజలకు కనబడలేదు. కొన్ని క్షణాల అనంతరం బూడిద లాంటి పదార్థం కొంత స్వామీజీమీద, కొంత అతని చుట్టూ భూమ్మీద పడిపోయింది. ఆ క్షణంలో స్వామీజీ చేతిలో ఎర్రని బైండుగల పుస్తకం కనబడింది. తన తపోబలంతో పుస్తకం తయారు చేశాడనుకున్నారు ప్రజలు.

స్వామీజీ పుస్తకం తెరిచి కన్నులను త్రిప్పి ఒకచోట ఆగి అనసూయవైపు చూచి చిరునవ్వు నవ్వి "సంతానం పొందగోరువారు ఒక మండలం అనగా నలభై రోజులు ఒక్కపూట మాత్రమే భోజనం చేస్తూ దేవుణ్ని ధ్యానించాలి. భగవంతునికి నూటాఇరవై అయిదు రూపాయలు సమర్పించుకోవాలి. ఇంతే సంగతులు భక్తులారా! సర్వం జగన్నాథం" అని కళ్ళు మూసుకున్నాడు.

"నూటాఇరవైఅయిదు రూపాయలు భగవంతుని కివ్వడానికి మేము సిద్ధమే. కాని మాకు భగవంతు డెక్కడ కనబడతాడు" ప్రశ్నించింది శకుంతల.

స్వామీజీ శకుంతల వైపు చూచి కళ్ళు మూసుకొని గడ్డం నిమురుకొని "నీవు ఆ డబ్బు మా కందిస్తే మేము స్వయముగా భగవంతుని అందజేస్తాం" అన్నాడు.

"మీకు భగవంతుడు కనిపిస్తాడా?"

స్వామీజీ కాస్త కోపంతో "పిచ్చిదానా! క్షణం వ్యర్థం చేయకుండా తపస్సుచేయు మాకు భగవంతుడు కనిపించకపోవడ మేమిటి? ఇకముందు ఇలాటి పిచ్చి ప్రశ్నలువేసి మాకు కోపం తెప్పించకుము. సర్వం జగన్నాథం" అన్నాడు.

"తెలియనివారము స్వామీ! కోపగించుకోకండి. మీరు చెప్పినట్లే చేస్తాం. సంతానం కలుగాలే గానీ దేవునికి నూటపాతిక......"

ఆమె మాట పూర్తికాకముందే అన్నాడు. అధికంగా మాట్లాడకూడదు భక్తులారా! మేమి చెప్పితిమి. నీవు వింటివి. నచ్చినచో నేను చెప్పినది పాటించుము, లేనిచో వెళ్ళిపొమ్ము. సర్వం జగన్నాథం."

శకుంతల ఆ రోజు నూటఇరవై అయిదు రూపాయలు తెచ్చి స్వామీజీకి అందించింది. (సశేషం)